రెచ్చిపోతున్న బ్లేడ్ బ్యాచ్

- అవుటర్‌లో కొనసాగుతున్న దాడులు
- విధులకు వెళ్లాలంటేనే హడలిపోతున్న సిబ్బంది

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విజయవాడ రైల్వే స్టేషన్లో ఉద్యోగులు, ప్రయాణికుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ఇక్కడ విధులు నిర్వహించే ఆర్‌పీఎఫ్, ప్రభుత్వ రైల్వే పోలీసు (జీఆర్‌పీ) సిబ్బంది నిఘా అంతంత మాత్రమే ఉండటంతో గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లు రెచ్చిపోతున్నాయి. గత ఏడాది అక్టోబర్ 10న నైజాంగేటు సెంటర్ సమీపంలోరి రైల్వే యార్డ్‌లో విధులు నిర్వర్తిస్తున్న లోకోపైలట్ ఎబినేజర్‌పై ఆగంతకుడు గంజాయి మత్తులో ఇనుప రాడ్‌తో దాడి చేయడంతో అతను మృతిచెందిన విషయం తెలిసిందే.

ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ సిబ్బంది విఫలం

విజయవాడ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లోని అవుటర్లలో రాత్రుళ్లు విధులు నిర్వహిస్తున్న సిబ్బందిపై గంజాయి, బ్లేడు బ్యాచ్ వరుస దాడులకు పాల్పడుతున్నా ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ సిబ్బంది వారిని కట్టడి చేయడంతో మాత్రం విఫలం చెందుతున్నారనే ఆరోపణలున్నాయి.

వరుస దాడులు

నైజాంగేటు సెంటర్ సమీపంలోని రైల్వే యార్డులోని లోకోపైలట్ హత్య ఉదంతంతో స్టేషన్ పరిప్రాంతాల్లోని యార్డులు, ట్రాక్‌ల వెంబడి పెట్రోలింగ్, ప్రత్యేక తనిఖీలతో కొన్ని రోజులు హడావుడి చేసిన ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ తరువాత పట్టించుకోవడం మానేశారు. దీంతో గంజాయి, బ్లేడ్ బ్యాచ్ మళ్లీ రెచ్చిపోయి సిబ్బంది, ప్రయాణికులపై వరుస దాడులకు పాల్పడుతున్నారు.



లోకోపైలట్ హత్య జరిగిన నైజాంగేటు ప్రాంతంలోని రైల్వే యార్డ్

పెద్ద రైల్వే జంక్షన్

భారతీయ రైల్వేలోనే అతి పెద్ద రైల్వే జంక్షన్‌లలో విజయవాడ స్టేషన్ ఒకటి. ప్రతి రోజూ 250 రైళ్లు, సుమారు 1.5 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే ఈ స్టేషన్‌లో ప్రయాణికులు, రైల్వే ఉద్యోగుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. దీంతో రాత్రుళ్లు విధులకు వెళ్లేందుకు సిబ్బంది హడలిపోతున్నారు. విధుల్లో తమకు భద్రత కల్పించాలంటు పలుమార్లు డీఆర్‌ఎంకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోకపోవడంతో సిబ్బందిపై దాడులు జరుగుతునే ఉన్నాయని వారు వాపోతున్నారు.

కొన్ని ఉదాహరణలు..

- ఈ ఏడాది ఫిబ్రవరి 14న బస్‌స్టేషన్ సమీపంలోని పూలమార్కెట్ వద్ద గూడ్స్ రైలుపై బ్లేడ్ బ్యాచ్ రాళ్లతో దాడి చేయడంతో అందులోని అసిస్టెంట్ లోకోపైలట్ పి.సురేష్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు.
- అదే ప్రాంతంలో ఫిబ్రవరి 19న ఇద్దరు బ్లేడ్ బ్యాచ్ సభ్యులు గంజాయి మత్తులో ఫుట్ బోర్డుపై నిలుచున్న ప్రయాణికుడిపై కర్రలు, రాళ్లపై దాడిచేసి కిందకి లాగి బ్లేడుతో దాడి చేసి నగదు, సెల్‌ఫోన్ దోచుకున్నారు.
- గత నెల్లో రాయనపాడు-కొండపల్లి ఎల్‌సీ గేటు వద్ద విధుల్లో ఉన్న గేట్‌మ్యాన్‌పై ఇద్దరు ఆగంతకులు మద్యం మత్తులో రాళ్లతో దాడి చేసి గాయపర్చారు.
- ఈ నెల 7న మిల్‌ప్రాజెక్ట్ సమీపంలోని వ్యాగన్ డిపో వద్ద విధుల్లో ఉన్న ట్రైన్ మేనేజర్ (గార్డ్) సుధీర్‌బాబుపై ఆగంతకులు రాళ్లతో దాడి చేయడంతో కంటి పైభాగం తగిలి గాయపడ్డాడు. ఇటువంటి ఘటనలలో కొందరు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వెలుగులోకి వస్తున్నాయి. మరి కొన్ని సందర్భాల్లో బాధితులు కేసులు పెట్టకుండా వెళ్లిపోతున్న సంఘటనలు కూడా ఉన్నాయి. వీటితో పాటు ఇప్పుడు పెరుగుతున్న గంజాయి, బ్లేడ్ బ్యాచ్ దాడులతో ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీకి సవాలుగా మారింది. రాత్రిళ్లు సిబ్బంది తమ విధులు నిర్వర్తించేకునేలా యార్డ్‌లు, స్టేషన్ పరిసర ప్రాంతాల్లో పోలీసు గస్తీ ముమ్మరం చేయాలని, యార్డ్‌లలో విద్యుత్ లైట్‌లు ఏర్పాటు చేసి భద్రతకు భరోసా కల్పించాలని ఉద్యోగులు కోరుతున్నారు.



గంజాయి బ్యాచ్ దాడిలో గాయపడ్డ ట్రైన్ మేనేజర్



బ్లేడ్ బ్యాచ్ దాడిలో గాయపడ్డ లోకోపైలట్

క్లుప్తంగా

దుర్గమ్మ సన్నిధిలో నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన భాగవతుల సౌమ్య శిష్యబృందం శుక్రవారం నృత్య ప్రదర్శన ఇచ్చింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట కళావేదికపై 25 మంది నృత్యకారులు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయప్రాంగణంలో నిర్వహించిన నృత్య ప్రదర్శనను భక్తులు ఆద్యంత ఆసక్తితో తిలకించారు. అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలను అందజేశారు.

హెరిటేజ్ వేవ్స్ శారీస్ ఎగ్జిబిషన్ ప్రారంభం



కృష్ణలంక(విజయవాడతూర్పు): ఎంజీరోడ్డులోని లెమన్‌ట్రీ హోటల్లో సెకండ్ స్కిన్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన హెరిటేజ్ వేవ్స్ శారీస్ ఎగ్జిబిషన్ కమ్ సేల్‌ను శుక్రవారం ప్రారంభించారు. సెకండ్ స్కిన్ సంస్థ మేనేజర్ రాజేనీస్ మాట్లాడుతూ ఈ నెల 21న ప్రారంభమైన ఎగ్జిబిషన్ 22 తేదీ వరకు రెండు రోజుల పాటు కొనసాగుతుందన్నారు. పటాన్ పటోలా, ప్యూర్ జరీకోట, బెనారస్, రాజ్‌కోట్ పటోలా, టస్సార్ ఎంబ్రాయిడరీ, టస్సార్ ప్రింటెడ్, కంచి కళంకారీ, చందేరీ సిల్క్ తదితర రకాల చీరలు ప్రదర్శనలో అమ్మకానికి ఉంచామన్నారు.

మైనార్టీలపై కూటమి చిన్నచూపు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ముస్లిం మైనార్టీలపై కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అడ్వైజరీ కమిటీ సభ్యుడు, ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ షేక్ ఆసిఫ్ ఆరోపించారు. ఆయన కార్యాలయంలో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పవిత్ర హజ్ యాత్రకు వెళ్లే వారికి విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ తొలగించటంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషితో ఏపీ నుంచి వెళ్లే యాత్రీకులకు విజయవాడలో ఎంబార్కేషన్ పాయింట్‌ను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఆ పాయింట్‌ను తీసివేస్తున్నట్లు కేంద్రం ప్రకటించిందన్నారు. మైనార్టీలను ముఖ్యమంత్రి చంద్రబాబు పూర్తిగా విస్మరించారని అందువలనే ఈ విధమైన ముస్లిం వ్యతిరేక విధానాల కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

సినీనటి తేజశ్వి సందడి



లబ్బీపేట(విజయవాడతూర్పు): సినీనటి తేజశ్వి మడివాడ శుక్రవారం నగరంలో సందడి చేశారు. టిక్కిల్‌రోడ్డులోని అంబటి సిల్క్స్ వార్షికోత్సవ వేడుకల్లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆమెను చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంప్రదాయం, చక్కదనం, అచంచలమైన కస్టమర్ల నమ్మకానికి అంబటి సిల్క్స్ ప్రతీకగా పేర్కొన్నారు. కార్యక్రమంలో షోరూమ్ నిర్వాహకులు పాల్గొన్నారు.

పన్ను చెల్లింపులకు క్యాష్ కౌంటర్లు

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో వీఎంసీకి చెల్లించాల్సిన వివిధ పన్నుల చెల్లింపుల కోసం నగరంలోని మూడు సర్కిళ్ల పరిధిలో 13 క్యాష్ కౌంటర్లను ఏర్పాటు చేశామని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంతాల్లోన్ని క్యాష్ కౌంటర్లో ఆరు క్యాష్ కౌంటర్లు మాత్రం ప్రతిరోజూ ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు పని చేస్తాయని పేర్కొన్నారు. చిట్టినగర్‌లోని సర్కిల్-1 కార్యాలయంలో రెండు క్యాష్ కౌంటర్లు, సర్కిల్-2 పరిధిలోని సత్యనారాయణ పురం ఏకేటీపీఎం స్కూల్ పక్కనే ఉన్న సర్కిల్ కార్యాలయంలో రెండు క్యాష్ కౌంటర్లు, పటమట సెంటర్‌లో ఉన్న బీవీఆర్ కాంప్లెక్స్ సర్కిల్-3 కార్యాలయంలో రెండు క్యాష్ కౌంటర్లు పన్ను చెల్లింపుదారులకు అందుబాటులో ఉంటాయని, ఆయా క్యాష్ కౌంటర్లు సెలవు దినాల్లో కూడా పనిచేస్తాయని ఆయన తెలిపారు. నగరవాసులు వీఎంసీకి పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి తోడ్పడాలని ఆయన కోరారు.

పాత పెన్షన్ పద్ధతిని సాధించే వరకు ఉద్యమం

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైల్వే కార్మికులకు ఆసరాగా ఉండే విధంగా పాత పెన్షన్ పద్ధతిని సాధించే వరకు ఉద్యమిస్తామని ఎంప్లాయీస్ సంఘ్ అసిస్టెంట్ జనరల్ సెక్రెటరీ నాగేంద్రబాబు పేర్కొన్నారు. విజయవాడ డీఆర్‌ఎం కార్యాలయం ముందు శుక్రవారం ధర్నా నిర్వహించి లంచ్ అవర్ గేట్ మీటింగ్ నిర్వహించారు. నాగేంద్రబాబు మాట్లాడుతూ కొంతకాలంగా నూతన పెన్షన్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేస్తే రైల్వేశాఖ కంటి తుడుపు చర్యగా యూపీఎస్‌ను ప్రవేశపెట్టి చేతులు దూలుపుకుందని విమర్శించారు. ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో విధులు నిర్వహిస్తున్న కార్మికులు 12 గంటల రోస్టర్‌ను ఎదుర్కొంటున్నారని వారికి ఎనిమిది గంటల రోస్టర్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైల్వే విభాగంలో అన్ని డిపార్ట్‌మెంట్‌లలో సమస్యలు కోకల్లలులుగా ఉన్నాయని, దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న బోనస్ సీలింగ్ ఎత్తివేయాలని, 18 నెలలు బకాయి ఉన్న డీఏను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎంప్లాయీస్ సంఘ్ డివిజన్ అధ్యక్ష,కార్యదర్శులు ఆమంచి వెంకటేశ్వరావు, ఆకుల రాఘవేంద్ర మాట్లాడుతూ టికెట్ చెకింగ్ సిబ్బందికి రన్నింగ్ సిబ్బందికి మాదిరిగా రన్నింగ్ రూములు ఏర్పాటు చేయాలకోరారు. అనంతరం డీఆర్‌ఎంకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎంప్లాయీస్ సంఘ్ సెంట్రల్ వర్కింగ్ కమిటీ మెంబర్లు రమేష్, దేగల శ్రీను, డెప్యూటీ డివిజనల్ కార్యదర్శులు రాజబాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



డీఆర్‌ఎంకు వినతిపత్రం అందజేసిన ఎంప్లాయీస్ సంఘ్ నేతలు

క్షేత్రస్థాయిలో విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు తరగతి గదిలోనే కాకుండా వారి రంగాలకు చెందిన క్షేత్రస్థాయిల్లోనూ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శరవణకుమార్ అన్నారు. ఆ కళాశాల ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా కొండపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను విద్యార్థులు శుక్రవారం పరిశీలించారు. 220 కేవీ సబ్‌స్టేషన్ విద్యుత్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌లో అత్యంత కీలకమైన కేంద్రమన్నారు. హైవోల్టేజ్ ట్రాన్స్‌మిషన్ సిస్టమ్ కావటం, విద్యుత్ వినియోగదారులకు ముఖ్యమైన ఇంటర్ ఫేస్, ఆపరేషన్ స్థిరత్వం తదితర అంశాలపై విద్యార్థులకు అధికారులు వివరించారు. విభాగాధిపతి డాక్టర్ కే సురేష్ బాబు, అధ్యాపకులు డీ విజయలక్ష్మి, డీడీవి ప్రసాద్, వంశీకృష్ణ పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందనలు

ఈఈఈ విభాగం తృతీయ సంవత్సరం విద్యార్థులు శకుంతల, రమ్య, గాయిత్రి తదితరులు ఇటీవల ధనేకుల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ నిర్వహించిన ధనుష్-2025 టెక్నికల్ ఫెస్ట్‌లో పలు బహుమతులను సాధించారు. ఈ సందర్భంగా వారిని కళాశాల కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ శరవణకుమార్ పాల్గొన్నారు.



విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న విద్యార్థులు

హజ్ యాత్రికులకు కూటమి ప్రభుత్వం ద్రోహం

వించిపేట(విజయవాడపశ్చిమ): విజయవాడ నుంచి హజ్‌యాత్రకు వెళ్లే యాత్రికుల కోసం గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సాధించిన హజ్ ఎంబార్కెషన్ పాయింట్‌ను కూటమి ప్రభుత్వం రద్దు చేసి ముస్లిం మైనార్టీలకు తీరని ద్రోహం చేసిందని ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ గౌస్‌మొహిద్దీన్ మండిపడ్డారు. శుక్రవారం వించిపేటలో మసీద్‌లో ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో రాష్ట్రంలోని ముస్లింలు హజ్‌యాత్రకు వెళ్లేందుకు పొరుగు రాష్ట్రాలైన హైదరాబాద్, బెంగళూరు నుంచి వెళ్లేందుకు ఇబ్బందులు పడేవారన్నారు. వారి ఇబ్బందుల దృష్ట్యా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వ చొరవతో విజయవాడకు హజ్ ఎంబార్కేషన్ పాయింట్ ఏర్పాటు చేయడడంతో పాటు హజ్ యాత్రికులకు రూ. 80వేలు సబ్సిడీ భారాన్ని భరించారని గుర్తుచేశారు. గత ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం హజ్ యాత్రికులకు రూ.లక్ష సబ్సిడీ ఇస్తామని మైనార్టీలను నమ్మించి అధికారంలోకి వచ్చిన తరువాత సబ్సిడీ ఇవ్వకపోగా విజయవాడలో ఎంబార్కేషన్ పాయింట్‌ను రద్దు చేయడం దారుణమన్నారు. ఇప్పటికైన విజయవాడ హజ్ ఎంబార్కేషన్‌ను పునరుద్ధరించాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.లక్ష సబ్సిడీని ప్రభుత్వమే భరించాలని ఆయన డిమాండ్ చేశారు.

విజయవాడలో రెండు రోజుల ట్రావెల్ ఎగ్జిబిషన్

ఇండియన్ ఇంటర్నేషనల్ ట్రావెల్ ఎగ్జిబిషన్ డైరెక్టర్ అనురాగ్ గుప్తా

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జాతీయ, అంతర్జాతీయ పర్యాటకాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా విజయవాడలో రెండు రోజులు ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశామని ఇండియన్ ఇంటర్నేషనల్ ట్రావెల్ ఎగ్జిబిషన్ (ఐఐటీఈ) డైరెక్టర్ అనురాగ్ గుప్తా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ బందర్ రోడ్‌లోని రాఘవయ్య పార్క్ సమీపంలోని విజయ కృష్ణ సూపర్ బజార్‌పై అంతస్తులో ఉన్న అమరావతి కన్వెన్షన్స్‌లో ఈ నెల 22, 23 తేదీల్లో ప్రదర్శన ఉంటుందన్నారు. ఐఐటీఈ అనేది ట్రావెల్, టూరిజం, రైల్వేలు, హాస్పిటాలిటీ, అనుబంధ పరిశ్రమల్లో ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి ప్రదర్శిస్తుందని వివరించారు. ఈ ట్రావెల్ ఎగ్జిబిషన్ దేశీయ, అంతర్జాతీయ పర్యాటక గమ్యస్థానాలు, హోటళ్లు, రిసార్ట్‌లు, అనుబంధ సేవలు, దేశ విదేశీ టూర్ ఆపరేటర్ల వివరాలు అందిస్తుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ టూరిజంతో పాటు మధ్య ప్రదేశ్ టూరిజం తదితర రాష్ట్ర పర్యాటక సంస్థలనూ ప్రదర్శిస్తుందన్నారు. దేశీయంగా కూర్గ్‌లోని అత్యంత విలాసవంతమైన రిసార్ట్‌లలో ఒకటైన కర్ణాటక టింబర్ టేల్స్, ఇతర ప్రముఖ ప్రాంతాలనూ చూపిస్తుంది. సందర్శకులకు ఈ ప్రదర్శన ప్రవేశం పూర్తిగా ఉచితమని, పర్యాటక ప్రియులే కాకుండా నగర వాసులంతా సందర్శించాలని ఐఐటీఈ డైరెక్టర్ అనురాగ్ గుప్తా ఆహ్వానించారు.

చక్కని పర్యావరణానికి అడవులు దోహదం

లబ్బీపేట(విజయవాడతూర్పు): అడవులను సంరక్షించినప్పుడు మంచి పర్యావరణం సాధ్యపడుతుందని రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి చిరంజీవి చౌదరి అన్నారు. మంచి పర్యావరణం లేనప్పుడు రోడ్లు, షాపింగ్ మాల్స్, బిల్డింగ్స్, కర్మాగారాలు ఎన్ని ఉన్నా వ్యర్థమని ఆయన పేర్కొన్నారు. శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల వృక్షశాస్త్ర విభా గం, ఎకో క్లబ్ సంయుక్త ఆధ్వర్యాన శుక్రవారం ఇంటర్నేషనల్ డే ఆఫ్ ఫారెస్ట్‌ను పురస్కరించుకుని సదస్సు జరిగింది. ముఖ్యఅతిథి చిరంజీవి చౌదరి మాట్లాడుతూ నల్లమల, మారేడుమిల్లిలో గడిచిన మూడు, నాలుగు నెలల్లో వర్షాలు లేవని, ముందు కురిసిన వర్షాలతో ఆ ప్రదేశాల్లో ఉన్న నీటితో ప్రస్తుతం అక్కడి ప్రజలు జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. ఇదంతా అడవుల నాశనం వల్ల జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. 1990కి ముందు మనం ఆహారం కోసం వేరే వారిపై ఆధారపడే వాళ్లమని, ఇప్పుడు ఆహారం సరఫరా చేసే స్థాయికి ఎదిగామన్నారు. ఫారెస్ట్‌మెన్ ఆఫ్ ఇండియా అవార్డు గ్రహీత కోమెర అంకారావు మాట్లాడుతూ తులసి, రావి మొక్కలను మనం ఇంట్లో పెట్టుకుంటే 24 గంటలూ ఆక్సిజన్ ఇస్తాయన్నారు. వేపచెట్టు పెంచుకుంటేవైరస్ వ్యాప్తి ఉండదన్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు నూతన సాంకేతికతను అందిపుచ్చుకుని ఉన్నతంగా ఎదగాలని కృష్ణా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.ఉష అన్నారు. కేబీఎన్ కళాశాల 60వ వార్షికోత్సవ వేడుకలు ఆ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ఆచార్య ఉష మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలంటే విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ నిరంతర శ్రమతో ముందుకు సాగాలన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ రామారావు మాట్లాడుతూ దేశానికి వెన్నెముక యువతేనన్నారు. విద్యార్థులు ఆరోగ్యంతో పాటుగా సామాజిక చైతన్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. హిందూ హైస్కూల్ కమిటీ అధ్యక్షుడు తొమ్మండ్రు శేషయ్య, కేబీఎన్ కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు ఉసిరిక ఉమామహేశ్వరరావు, తూనికుంట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ తమ కళాశాల వార్షికోత్సవాన్ని జరుపుకోవటం ఆనందంగా ఉందన్నారు. హిందూ హైస్కూల్ కమిటీ ఏఓ డాక్టర్ వీ నారాయణ రావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కళాశాలలో పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. వివిధ పాశ్చాత్య, శాస్త్రీయ నృత్యాలతో పాటుగా ఏకాంకికలు, దేశభక్తి గీతాలు ఆకట్టుకున్నాయి.



మాట్లాడుతున్న ఆచార్య ఉష

28న ఇళ్ల సమస్యల పరిష్కారం కోసం ధర్నా

వించిపేట (విజయవాడపశ్చిమ): పేదల ఇళ్ల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 28న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో ప్రజలు పాల్గొనాలని సీపీఎం పశ్చిమ నగర కార్యదర్శి, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం 50వ డివిజన్, గొల్లపాలెంగట్టు, కొండ ప్రాంతంలో ఇళ్ల స్థలాల సమస్యలపై స్థానిక ప్రజలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు అవుతున్నా ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుండా పేదలను మోసం చేసిందన్నారు. కబేలా ప్రాంతంలో ఖాళీగా ఉన్న ఇళ్లను పేదలకు ఇవ్వాలని కోరారు. వైఎస్ఆర్ కాలనీలో ఖాళీగా ఉన్న జేఎన్ఎంయూఆర్ ఇళ్లను పూర్తి చేసి పేదలకు ఇవ్వాలని లేని పక్షంలో రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నగర కమిటీ సభ్యులు పి.రాజు, నాయకులు మహేష్, కే.లక్షణ, దుర్గారావు పాల్గొన్నారు.



గొల్లపాలెంగట్టు కొండ ప్రాంత ప్రజలతో మాట్లాడుతున్న సత్యబాబు

30న సుబ్రహ్మణ్య స్వామికి అభిషేకాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): విశ్వావసు నామ సంవత్సరాదిని పురస్కరించుకుని 30వ తేదీన సుబ్రహ్మణ్య స్వామికి విశేష అభిషేకాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు విన్నకోట శ్రీనివాస రావు శర్మ తెలిపారు. కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్‌లోని శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో వేం చేసిన సుబ్రహ్మణ్య స్వామికి తెల్లవారుజామున సుప్రభాత సేవ, పంచామృత అభిషేకాలు, విశేష అలంకరణ, పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. తెలుగు వారి నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని స్వామికి జరిగే పూజా కార్యక్రమాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చే అవకాశం ఉండటంతో ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నామని ఈఓ వై.సీతారామయ్య తెలిపారు.

బీబీఏ ఎన్నికలకు ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

విజయవాడలీగల్: బెజవాడ బార్ అసోసియేషన్ ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం పూర్తయింది. ఎన్నికల ప్రధాన అధికారి డి.పి.రామకృష్ణ ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించారు. అధ్యక్ష స్థానానికి విష్ణుభొట్ల లక్ష్మీనారాయణ, ఎ.కె.బాషా, బి.డేవిడ్ రత్నకుమార్, ప్రధాన కార్యదర్శి పదవికి రావూరి చునావ్, కె.వి.రంగారావు, బైపూడి నాగేశ్వరరావు, ఎస్.వి.వి. సుబ్రహ్మణ్యం, జాయింటు సెక్రటరీ పదవికి జి.వి.లక్ష్మీ, కలపాల సుబ్బారావు, లేడీ సెక్రటరీ పదవికి జి.మాలతీ, కె.అనురాధ, లైబ్రేరియన్ సెక్రటరీగా కంచర్ల త్రినాథ్ కుమార్, పిళ్ళా సత్యనారాయణ, ట్రెజరర్‌గా ఐ.రవీంద్రనాథ్, ముద్దాడ సత్యనారాయణ, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా కె.నవీన్‌కుమార్, పి.రవిబాబు పోటీలో ఉన్నారు. ఉపాధ్యక్ష పదవికి పిళ్ళా శ్రీనివాసరావు, అలాగే 30 సంవత్సరాల పైన ఎగ్జిక్యూటివ్ మెంబరుగా పి.వి.ఏడుకొండలు మాత్రమే నామినేషన్ వేయడంతో ఇద్దరు ఏకగ్రీవం అయ్యే అవకాశం ఉంది.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ సెక్షన్ కేఎల్ రావు నగర్ సబ్ స్టేషన్ పరిధిలోగల 11 కేవీ ఓం శక్తి ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతులతోపాటు మెయింటెనెన్స్ నిమిత్తం కొన్ని ప్రాంతాల్లో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు కేఎల్ రావు నగర్ 7వ, 5వ లైన్ చిన్న చర్చి ప్రాంతం, 2వ లైన్ బీఎస్ఎన్ఎల్ ఏరియా, కుండల మార్కెట్ గంగానమ్మ గుడి ప్రాంతం, కోళ్ల ఫారం ప్రాంతం, బీఎంసీ స్కూల్ తదితర ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు తెలిపారు.

బాటసారుల దాహార్తి తీర్చడానికి చలివేంద్రం

లబ్బీపేట(విజయవాడతూర్పు): వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు కాకాని ఆశయ సాధన సమితి వ్యవస్థాపకుడు తరుణ్ కాకాని బెంజిసర్కిల్‌లో చలివేంద్రం ఏర్పాటు చేశారు. దీన్ని శుక్రవారం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్‌తో కలిసి బీజేపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ ప్రారంభించారు. తొలుత ఈ సెంటర్‌లోని కాకాని వెంకట రత్నం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నేతలు రమేష్ మాదాల, అవ్వారు బుల్లబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ సమతుల్యతకు ప్రాధాన్యమివ్వాలి

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): పర్యావరణ సమతుల్యతకు ప్రాధాన్యమివ్వాలని పారిశ్రామికవేత్త, పీబీ సిద్ధార్థ కళాశాల వ్యవస్థాపకుల్లో ఒకరైన పర్వతనేని బ్రహ్మయ్య కుమారుడు సంతోష్‌కుమార్ చెప్పారు. వనరులను అవసరానికి మించి వినియోగిస్తే వాతావరణంలో మార్పులు జరిగి భూమిపై నివశించే వారు అనేక దుష్పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. సుస్థిర భవిష్యత్తును నిర్దేశించే పర్యావరణ, సామాజిక పాలనా కారకాలు అనే అంశంపై సిద్ధార్థ కళాశాలలోని ఎంబీఏ విభాగం ఆధ్వర్యాన కళాశాల ఆవరణలోని వెబినార్ హాల్‌లో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్, సౌత్ రీజనల్ సెంటర్ (ఐసీఎస్ఎస్ఆర్-ఎస్ఆర్‌సీ) సహకారంతో రెండు రోజుల జరిగే జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. సంతోష్‌కుమార్ మాట్లాడుతూ భూమి ఉష్ణోగ్రతను పెంచేస్తున్న కర్బన ఉద్గారాలను కట్టడి చేయకపోతే వాతావరణ సమతుల్యతను పునరుద్ధరించలేమని చెప్పారు.

గ్లోబల్ వార్మింగ్‌తో అనేక మార్పులు

గ్లోబల్ వార్మింగ్ కారణంగా పర్యావరణంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. వాటిలో ప్రధానంగా హిమ పర్వతాలు తరిగిపోతున్నాయన్నారు. భూతాపం పెరగడం, భూకంపాలు, వరదలు, అడవుల్లో కార్చిచ్చులు వంటి దుష్పరిణామాలను చూస్తున్నామని వివరించారు. విద్యావేత్తలు, పర్యావరణవేత్తలు, కోల్ ఇండియా ప్రతినిధులు పరిశోధన పత్రాలను సమర్పించారు. సదస్సు డైరెక్టర్ ప్రొఫెసర్ రాజేష్ సి జంపాల, వైస్ ప్రిన్సిపాల్ మనోరంజని, లీడ్ ఈఎస్‌జీ కార్పొరేట్ రేటింగ్స్ అండ్ రీసెర్చ్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ హరీష్ శ్రీవాత్సవ వంగల పాల్గొన్నారు.